సాక్షి
మంచిర్యాల

ఆదివారం ◆ 11 ◆ ఆగస్టు ◆ 2024



ఫలితమిస్తున్న గడ్డిక్షేత్రాలు
కవ్వాల్ టైగర్‌జోన్‌లో శాఖహార జంతువుల సంతతి పెంపునకు అటవీశాఖ పెంచుతున్న గడ్డి క్షేత్రాలు సత్ఫలితాలిస్తున్నాయి. పులి వచ్చే అవకాశాలు పెరుగుతున్నాయి. 8లో▸



ఆగస్టు వర్షాలపైనే భారం! 8లో▸
మునురు వర్షంతో గోదావరి ఇప్పటివరకు ఉప్పొంగలేదు. బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తినా ఎస్సారెస్పీలోకి ఆశించిన వరద చేరలేదు. ఆగస్టు వర్షాలపైనే ఆశలు ఉన్నాయి.

గరిష్టం/కనిష్టం
32.2 /26.6

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతు పవనాల ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కామన్ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో ప్రతిభ

మంచిర్యాలఅర్బన్: కామన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ టెస్ట్(సీపీజీఈటీ)లో మంచిర్యాల విద్యార్థులు ప్రతిభ చాటారు. 2024 సీపీగేట్ సెట్‌లో ఎంకాం విభాగంలో అల్తాఫ్ 42వ ర్యాంకు సాధించారు. బీఎస్సీ డాటా సైన్స్ విభాగంలో సమర్‌సేల్ 55 వర్యాంకు, ప్రణయ్ 89వ ర్యాంకు వీఎమ్మెస్సీ డాట సైన్స్ సీహెచ్ సాయికిరణ్ 318వ ర్యాంకు,ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ విభాగంలో శ్రావణి 171వ ర్యాంకు సాధించి రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. స్థానిక శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యను పూర్తి చేసుకుని తెలంగాణ సీపీగేట్ సెట్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ పల్లె భూమేశ్‌తోపాటు ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిత ఠాకూర్, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

సేవాలాల్ సేన మహిళా ఉపాధ్యక్షురాలు నియామకం



బనావత్ సరోజ

పాతమంచిర్యాల: సేవాలాల్ సేన రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా బానావత్ సరోజ నియమితులయ్యారు. ఈమేరు సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు రాంబాబు ప్రకటించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ వనస్థలిపురంలో శుక్రవారం జరిగిన మహసభలో ఈ నియామకం జరిగిందని పేర్కొన్నారు.

రోడ్డెక్కిన పాడిరైతులు



రాస్తారోకో చేస్తున్న పాడిరైతులు

రామకృష్ణాపూర్: సమస్యల పరిష్కారం కోసం పాడిరైతులు రోడ్డెక్కారు. తెలంగాణ విజయ డైరీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో క్యాతనపల్లి హైవేపై శనివారం రాస్తారోకో చేశారు. సంఘం రాష్ట్ర కోకన్వీనర్ వీరమల్ల రాజయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం లీటర్ పాలకు రూ.4 ఇన్సెంటివ్ అని చెప్పి కొన్ని రోజులు పాలబిల్లుతో కలిపి ఇచ్చిందని తెలిపారు. దీంతో తమకు లాభం వచ్చేదని పేర్కొన్నారు. తర్వాత ఈ–ల్యాబ్ ఏర్పాటు చేయడంతో తమకు ఇన్సెంటివ్ రావడంలేదని తెలిపా రు. రావాల్సిన బిల్లులు కూడా సకాలంలో రాక ఇబ్బంది పడుతున్నామని వెల్లడించారు. ఇప్పటికైనా ఇన్సెంటివ్ ఇప్పించాలని, సబ్సిడీ కింద పాడి గేదెలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అంకతి రాయమల్లు, కుమార్, రాజు, మల్లేశ్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు



విజేతగా నిలిచిన టీమ్

మంచిర్యాలక్రైం: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీలు అట్టహాసంగా జరుగుతున్నాయి. శనివారం స్థానిక ఉషోదయ స్కూల్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. న్యాయవాదులు నాలుగు టీమ్‌లుగా ఏర్పడి తలపడ్డారు. ఇందులో పీపీ సురేంద్ర ఉపాధ్యాయ టీమ్, జ్యూడీషియల్ స్టాఫ్ టీమ్ ఫైనల్ మ్యాచ్‌కు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో పీపీ సురేంద్ర ఉపాధ్యాయ టీమ్ విజేతగా నిలిచింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ చైర్మన్ కట్కూరి గంగయ్య, జనరల్ సెక్రెటరీ మురళీకృష్ణ, స్పోర్ట్స్ కార్యాదర్శి సంతోష్, సీనియర్ న్యాయవాదులు వడ్నాల సత్యనారాయణ, ఎం.రవీందర్‌రావు, రంగు మల్లేశ్, మధన్‌మోహన్‌రావు, అరమంద రవి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీసీట్ల భర్తీకి 12న కౌన్సెలింగ్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గు రుకుల కళాశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఎంఈసీ గ్రూపులో ఖాళీగా ఉన్న సీట్లకు ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నిరుపమ తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 12న నిర్వహించే స్పాట్ కౌన్సెలింగ్‌కు సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పాట్ కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.

ఉపాధికి బాటలు!

- జిల్లాలో కొత్త ఇండస్ట్రియల్, ఐటీ పార్కులు
- హాజీపూర్ మండలంలో ఏర్పాటుకు అడుగులు
- ప్రణాళిక సిద్ధం చేసిన జిల్లా యంత్రాంగం
- ఎమ్మెల్యే పీఎస్సార్ చొరవతో చకచకా పనులు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పారిశ్రామిక జిల్లాగా పేరున్న మంచిర్యాల ఇండస్ట్రియల్ హబ్‌గా మారనుంది. కొత్తగా ఇండస్ట్రియల్, ఐటీ పార్కుల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. జిల్లా కేంద్రానికి సమీపంలో జాతీయ రహదారికి దగ్గరగా ఉన్న హాజీపూర్ మండలం వేంపల్లి, పోచంపాడు శివారులో ఉన్న 250 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశ్రమలకు కేంద్రంగా మార్చే పనులు చకచకా జరుగుతున్నాయి. దీంతో జిల్లా యువతతోపాటు రాష్ట్రంలోని అనేక మందికి ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు రెండు రోజుల క్రితం పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు. రూ.కోటి నుంచి రూ.వంద కోట్ల వరకు పెట్టుబడులు పెడితే ప్రభుత్వ పరంగా భూమి ఇవ్వడంతోపాటు సబ్సిడీపై రుణం, విద్యుత్ ఇస్తామని తెలిపారు.

చిగురిస్తున్న ఉపాధి ఆశలు..

మంచిర్యాలకు పారిశ్రామిక జిల్లాగా పేరు ఉన్నా.. కొత్త పరిశ్రమలు లేకపోవడంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. దీంతో జిల్లా యువత అవకాశాల కోసం వలస పోతున్నారు. ఈ నేపథ్యంలో ఇండస్ట్రీయల్, ఐటీ పార్కులతో స్థానికంగానే ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయి. దీంతో నిరుద్యోగుల్లో ఉపాధి ఆశలు చిగురిస్తున్నాయి. స్థానిక యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఇండస్ట్రియల్, ఐటీ పార్కుల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. పెట్టుబడిదారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

మూతపడిన పరిశ్రమలు..

జిల్లాలో అనేక మందికి ఉద్యోగం, ఉపాధిని అందించిన పరిశ్రమలు మూత పడుతున్నాయి. జిల్లా కేంద్రంలో ఉన్న బయోమాస్ ముడిపదార్థంగా విద్యుత్ ఉత్పత్తి చేసే శాలివాహన పవర్ ప్లాంట్, మంచిర్యాల సిమెంట్ కంపెనీ(ఎంసీసీ) ఇప్పటికే మూతపడ్డాయి. దీంతో వందల మంది ఉపాధి కోల్పోయారు. ప్లాస్టిక్ ఉత్పత్తులతో సిరామిక్ పరిశ్రమ కుదేలవుతోంది. ఈ పరిశ్రమలతో ఉపాధి పొందుతున్న వారికి ఇబ్బందులు మొదలయ్యాయి. ఇక సింగరేణిలోనూ కొత్తగా గనులు లేక, ఉన్న గనులు మూతపడడంతో కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. గతంలో మందమర్రి కేంద్రంగా తోళ్ల పరిశ్రమ ఏర్పాటు చేసినా, ఇప్పటికీ ఉత్పత్తి మొదలు కాలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం బెల్లంపల్లి పరిధిలో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్, మందమర్రి మండలం శంకర్‌పల్లి శివారులో పామాయిల్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రయత్నించింది. ఇవి కార్యరూపందాల్చలేదు. ఈ క్రమంలో కొత్తగా ఇండస్ట్రియల్ పార్కుతో ఉపాధి మెరుగుపడనుంది.

వనరులు పుష్కలం

జిల్లాలో అపార వనరులతో అనేక రకాల పరిశ్రమల స్థాపనకు అవకాశాలున్నాయి. గోదావరి నదితో నీటి సౌకర్యం ఉంది. బొగ్గు గనులు, సున్నపు రాయి, గ్రానైట్, ఇసుక ఆధారిత ముడి సరుకుల విరివిగా లభిస్తుంది. వ్యవసాయ ఆధారిత, వరి, పత్తి, మామిడి, దాల్ మిల్ ఇతర పంటలతో ఆగ్రో పరిశ్రమలు, అటవీ సంపద, ఆకులు, కర్ర, కాగితంతోపాటు ఇతర ఉత్పత్తుల ఆధారంగా చేపట్టే పరిశ్రమలకు వీలు ఉంది. శీతల గిడ్డంగులు, పశు, పౌల్ట్రీ, పాల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. గతంలోనే జిల్లా పరిశ్రమల శాఖ 12 రకాల పరిశ్రమల ఏర్పాటుకు జిల్లాలో అవకాశం ఉందని అంచనా వేసింది. ఇందుకు దాదాపు 2 వేల ఎకరాలుపైగా భూమి అవసరమని గుర్తించింది. అయితే ఆ ప్రణాళికలేవి ఆచరణకు నోచుకోలేదు. ప్రస్తుతం సున్నపు రాయి, సిమెంట్, మట్టిపైపులు, బొగ్గు ఆధారిత ఫ్లైయాష్ పరిశ్రమలు ఉన్నాయి. వీటితోపాటు బ్రెడ్, బేకరీ, ప్లేట్లు, వంటి చిన్నతరహా పరిశ్రమలు కొనసాగుతున్నాయి. బెల్లంపల్లిలో రెండు ఐటీ కంపెనీలు యువతకు ఉపాధి కల్పిస్తున్నాయి.

రోడ్డు, రైల్వే మార్గాలు..

జిల్లా మీదుగా జాతీయ రహదారులు ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని కలుపుతున్నాయి. ఎన్‌హెచ్ 363, 63, కొత్తగా నిర్మించనున్న మంచిర్యాల, మంథని, విజయవాడ, బెల్లంపల్లి గడ్చిరోలి హైవే కీలకంగా మారనున్నాయి. అలాగే రైల్వే స్టేషన్లతో ప్రయాణికులతోపాటు పరిశ్రమల ఉత్పత్తులు రవాణా చేయవచ్చు. ప్రస్తుతం మూడోలైన్ కూడా అందుబాటులోకి వచ్చింది. రైళ్ల వేగం పెరిగింది. దేశంలో ఏ ప్రాంతానికైనా స్థానిక ఉత్పత్తులను వేగంగా తరలించే అవకాశాలు ఉన్నాయి. ఇక పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌లో ఎయిర్ పోర్టు నిర్మించేందుకు కూడా అడుగులు పడుతున్నాయి. దీంతో దేశ, విదేశాలకు రవాణాకు అవకాశం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటయితే భవిష్యత్తులో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు అభివృద్ధి జరగనుంది.

ఇండస్ట్రియల్, ఐటీ పార్కు స్థల పరిశీలన



ప్రతిపాదిత స్థలం పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి శివారులో ఇండస్ట్రియల్ హబ్, ఐటీ పార్కు అభివృద్ధితో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రతిపాదిత స్థలాన్ని శనివారం సందర్శించారు. వేంపల్లి శివారులోని 159 సర్వే నంబర్‌లో ఉన్న దాదాపు 180 ఎకరాల స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ భూవిస్తీర్ణం, రెవెన్యూ రికార్డులకు సంబంధించి వివరాలపై ఆరా తీశారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా ఇండస్ట్రీయల్ హబ్, ఐటీ పార్కు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఖనిజ, బొగ్గు సంపదతోపాటు నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయన్నారు. వ్యాపారాన్ని అభివృద్ధి పథంలో నడిచేందుకు అవసరమైన రోడ్డు, రైలు మార్గాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. భవిష్యత్‌లో సమీపంలో ఏర్పాటు కానున్న ఎయిర్‌పోర్ట్ కూడా వ్యాపార అభివృద్ధికి మరింత దోహదం చేస్తుందని వెల్లడించారు. వివిధ పరిశ్రమలతోపాటు ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వ పరంగా తగిన ప్రోత్సాహం అందించి అనుమతులతోపాటు అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో జిల్లాలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. కలెక్టర్ వెంట హాజీపూర్ డిప్యూటీ తహసీల్దార్ హరిత, ఆర్‌ఐ మంగ, జూనియర్ అసిస్టెంట్ శ్రీలత ఉన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

- కలెక్టర్ కుమార్‌దీపక్



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలటౌన్: రక్తదానం చేసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, రక్తదానంతో ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చని కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని అదనపు కలెక్టర్ సభావత్ మోతిలాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసరంగా రక్తం అవసరమైన వారికి,తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు, గర్భిణులకు ప్రసవ సమయంలో అవసరమైన రక్తాన్ని అందించి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రక్తదానం చేయడం ద్వారా శరీరంలో నూతన రక్తం పెంపొంది మరింత ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మంచిర్యాల రెడ్‌క్రాస్ శాఖ రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ సేవలను అందించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత మంది ప్రాణాలను కాపాడుతూ ప్రజా సంక్షేమంలో ముందుండాలన్నారు. రక్తదాన శిబిరంలో ఆసుపత్రి సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం మరింత మందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ శిబిరంలో 191 యూనిట్ల రక్తం సేకరించడం హర్షనీయమన్నారు. అవయవదానంతో ఎంతో మందికి జీవితాన్ని అందించిన వారవుతామని, వారి జీవితాల్లో సంతోషాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానంతోపాటు, అవయవదానానికి ముందుకు రావాలని సూచించారు. ఈ నెల 15వ తేదీన తాండూర్ మండలంలో నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి, సీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ బీష్మ, ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీమన్నారాయణ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, రెడ్‌క్రాస్ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి చందూరి మహేందర్, అభినవ సంతోష్‌కుమార్, కాసర్ల శ్రీనివాస్, ముల్కల్ల సత్యనారాయణ, శంకర్ పద్మ, బొద్దినేని సత్యనారాయణ పాల్గొన్నారు.

లంచం అడిగితే సమాచారం ఇవ్వండి



పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

బెల్లంపల్లి/తాండూర్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎవరైనా లంచం అడిగితే వెంటనే సమాచారం అందించాలని బెల్లంపల్లి డివిజన్ డిస్కం డీఈ బి.రాజన్న తెలిపారు. బెల్లంపల్లిలోని డీఈ కార్యాలయం ఆవరణలో, తాండూర్ సబ్‌స్టేషన్ ఆవరణలో లంచం ఇవ్వకండి, సమాచారం ఇవ్వండి అనే పేరుతో ముద్రించిన వాల్ పోస్టర్లను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి సంస్థ కృషి చేస్తోందన్నారు. అవినీతిరహిత వ్యవస్థ ఏర్పాటుకు నిబద్ధతతో పని చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినియోగదారులు అధికారులకు, సిబ్బందికి లంచం ఇవ్వొవద్దని సూచించారు. ఎవరైన లంచం అడిగితే టోల్‌ఫ్రీ నంబర్ 1064, సెల్ నంబర్ 92810 33233కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి టౌన్, రూరల్ ఏడీఈలు రాంచందర్, కె.శ్రీనివాస్, ఏఈలు బి.శ్రీనివాస్, కె.రామ్ మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను విస్మరిస్తే పోరాటం తప్పదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్



జెండా ఆవిష్కరిస్తున్న సీనియర్ సీపీఐ నాయకుడు చిప్ప నర్సయ్య

పాతమంచిర్యాల: ప్రజాసమస్యలను విస్మరిస్తే ప్రభుత్వాలపై పోరాటం తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించారు. అంతకు ముందు పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని విశ్వాసంతో గెలిపించారని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రైతు రుణాల మాఫీలో స్పష్టత లేదని, రైతులను అయోమయానికి గురిచేయకుండా అందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఆసరా ఫించన్లు ఇవ్వాలన్నారు. పశ్చిమబెంగాళ్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, సీపీఐ రాష్ట్ర నాయకులు ధూళిపాల రాంచందర్‌రావు మృతికి సంతాపం ప్రకటించారు. కేరళ వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మశాంతికి మౌనం పాటించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, జోగుల మల్లయ్య, రేగుంట చంద్రశేఖర్, కారుకూరి నరేశ్, రేగుంట చంద్రకళ, బొంతల లక్ష్మీనారాయణ, దాగం మల్లేశ్, లింగం రవి, మిట్టపల్లి శ్రీనివాస్, వీరభద్రయ్య, దేవి పోచన్న, మేకల దాసు, ఖలీందర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం పనుల తనిఖీ



కిష్టాపూర్ పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

జన్నారం: మండలంలో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో చేపట్టిన పనులను కలెక్టర్ కుమార్ దీపక్ శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మండలానికి వచ్చిన విషయం తెలుసుకుని అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. రేండ్లగూడ గ్రామంలో నర్సరీ, పారిశుధ్య పనులు, డంపింగ్‌యార్డు, శ్మశాన వాటికలను పరిశీలించారు. నర్సరీ నిర్వహణపై సిబ్బందిని అభినందించారు. శ్మశాన వాటికలో మొక్క నాటారు. అక్కడి నుంచి కిష్టాపూర్ గ్రామానికి వెళ్లారు. పల్లె ప్రకృతి వనం, నర్సరీ, పారిశుధ్య పనులను పరిశీలించారు. డంపింగ్ యార్డులో వర్మీ కంపోస్టు తయారు చేసే విధానం అడిగి తెలుసుకున్నారు. నర్సరీల నిర్వహణ, పల్లె ప్రకృతి వనం, పారిశుధ్య పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందిని అభినందించారు. పారిశుధ్య పనులను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో శశికళ, ఎంపీవో జలేందర్, స్పెషల్ ఆఫీసర్ శ్రీకాంత్, కార్యదర్శులు శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్



నినదిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నేతలు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి అన్నారు. మంచిర్యాల పట్టణంలోని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా కార్యాలయం ఆవరణలో శనివారం అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతంకు మరింత నిధులు పెంచి అన్ని పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఐదు డీఏలు వెంటనే ప్రకటించాలని, పీఆర్సీ నివేదిక బహిర్గతపరిచి 30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చక్రపాణి, గుర్రాల రాజావేణు, ఉపాధ్యక్షుడు నర్సయ్య, లావణ్య, కోశాధికారి కిరణ్, కార్యదర్శులు చంద్రమౌళి, కిరణ్‌కుమార్, బాపు తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం.. అందని ద్రాక్షేనా?

- కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే అమలు..
- విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు..
- అమలుపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం



న్యూగర్మిళ్ల పాఠశాలలో అల్పాహారం తింటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు(ఫైల్)

మంచిర్యాలఅర్బన్: ఉదయం ఖాళీ కడుపుతో పాఠశాలలకు వచ్చే విద్యార్థుల ఆకలి తీర్చి పాఠాలు నేర్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గత ప్రభుత్వం సీఎం బ్రేక్‌పాస్ట్ (అల్పాహార పథకం) ప్రారంభించింది. తర్వాత ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారింది. ఆ తర్వాత కూడా పథకం ప్రారంభించిన పాఠశాలల్లో పథకం అమలు చేశారు. వేసవి సెలవుల తర్వాత కూడా కొన్ని పాఠశాలల్లో పథకం అమలవుతోంది. అన్ని పాఠశాలల్లో అల్పాహారం అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో అందరికీ అల్పాహారం అందని ద్రాక్షగానే మారింది.

రెండు నెలలైనా నిర్ణయం తీసుకోని వైనం..
నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు దాటింది. అయినా సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం కొనసాగిస్తారా.. నిలిపివేస్తారా అన్నది తెలియడం లేదు. ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. ఆ పాఠశాలల్లో కూడా మొక్కుబడిగా కొనసాగుతోంది. ప్రభుత్వం మాత్రం దీనిపై స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో మెజారిటీ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఖాళీ కడుపుతోనే పాఠశాలలకు వచ్చి పాఠాలు వింటున్నారు.

జిల్లాలో 716 పాఠశాలలు..
జిల్లాలో 761 పాఠశాలలు ఉన్నాయి. గతేడాది దసరాకు ఒకరోజు ముందుగా జిల్లాలో నియోజకవర్గానికి ఒక పాఠశాలను ఎంపిక చేసి సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రారంభించారు. మంచిర్యాల నియోజకవర్గంలో న్యూగర్మిళ్ల, చెన్నూర్ నియోజకవర్గంలో మందమర్రి ఫిల్టర్‌బెడ్ ఎంపీపీఎస్, బెల్లంపల్లి నియోజకవర్గంలో 2 ఇంక్‌లైన్ ఎంపీపీఎస్‌లో పథకం ప్రారంభించారు. కొన్ని రోజుల తర్వాత మరో 36 పాఠశాలల్లో అమల్లోకి తెచ్చారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ప్రభుత్వం మారింది. దీంతో మెజారిటీ పాఠశాలల్లో డిసెంబర్ 2 నుంచి అల్పాహారం పథకానికి బ్రేక్ పడింది. తర్వాత బిల్లులు చెల్లించడంతో ముందుకు సాగుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా కొనసాగింపు, అన్ని పాఠశాలల్లో అమలుపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అల్పాహారం ఇలా..
పిల్లలో పోషకాహార లోపం నివారణ, హాజరు నమోదు పెంచడం కోసం ప్రభుత్వం అల్పాహార పథకం ప్రారంభించింది. ఇందుకు ఒక్కో విద్యార్థికి రూ.10.50 చొప్పున కేటాయించాలని నిర్ణయించింది. అయితే ఇప్పటి వరకు నిధుల మంజూరుపై స్పష్టత లేకుండా పోయింది. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు 45 నిముషాల ముందుగా అల్పాహారం అందించాల్సి ఉంటుంది. సోమవారం ఇడ్లీ, సాంబారు లేదా గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ, మంగళవారం పూరి, ఆలుకుర్మా, లేదా టోమాటో బాత్, సాంబార్, బుధవారం ఉప్మా, సాంబారు లేదా బియ్యం రవ్వ కిచిడీ, చట్నీ, గురువారం చిరుధాన్యాల ఇడ్లీ, సాంబారు లేదా పొంగల్, సాంబారు, శుక్రవారం ఉగ్గని, అటుకలు, చిరుధాన్యాల ఇడ్లీ, చట్నీ, లేదా బియ్యం రవ్వ కిచిడీ, చట్నీ, శనివారం పొంగల్, సాంబారు లేదా కూరగాయల పులావ్, పెరుగు చట్నీ, ఆలుకుర్మా అందించాలి. ప్రభుత్వం విధి విధానాలు ఖరారు చేయకపోవటం.. కొన్నిచోట్ల పూరి, ఉంటే ఇడ్లీ లేదు. ఉప్మాకి, చిడి లాంటితో సరిపెడుతున్నారు.

బకాయిలు విడుదల చేశాం..
గతే విద్యసంవత్సరంలో ప్రారంభమైన అల్పాహారం బిల్లులు ఇటీవలనే విడుదల చేశాం. ఈ విద్యసంవత్సరం సీఎం బ్రేక్‌పాస్ట్ అమలుపై ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఇప్పటికే కొనసాగుతున్న పాఠశాలల్లో పథకం కొనసాగిస్తున్నాం. అన్ని పాఠశాలల్లో అమలుకు ఆదేశాలు వస్తే అమలు చేస్తాం.
– యాదయ్య, డీఈవో

క్లుప్తంగా

పేకాట స్థావరంపై దాడి

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో కొన్ని నెలలుగా గుట్టుగా సాగుతున్న పేకాటస్థావరాన్ని రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. పక్కా సమాచారంతో అశోక్ నగర్ బస్తీలోని ఓ ఇంటిపై శనివారం దాడి చేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వీరిలో ఓ మహిళ కౌన్సిలర్ భర్త ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.19,500 నగదు, 6 సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. తదుపరి విచారణ కోసం ఏడుగురిని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి అటవీప్రాంతంలో పక్కా సమాచారంతో ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో శనివారం పేకాట స్థావరంపై దాడి చేశారు. నలుగురిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,34,750 నగదు, 3 సెల్‌ఫోన్లు, 52 పేక ముక్కలను సీజ్ చేశామన్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

జ్వరంతో వివాహిత మృతి

కాసిపేట: జ్వరంతో బాధపడుతున్న వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందిందని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలానికి చెందిన రోషిణి (24), కాసిపేట మండలంలోని స్టేషన్ పెద్దనపల్లికి చెందిన ముక్కెర వెంకటేశ్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లయినప్పటి నుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతుండేవి. కులపెద్దలు పలుమార్లు పంచాయితీ నిర్వహించి ఇద్దరు కలిసి ఉండాలని సూచించారు. గురువారం రోషిణికి జ్వరం వచ్చింది. భర్త ఆమెను శుక్రవారం బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రి తీసుకెళ్లారు. చికిత్స అందిస్తుండగా ఫిట్స్ రావడంతో రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. కాగా, కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి తిరుపతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గొర్రె మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామంలో శనివారం విద్యుత్ షాక్‌తో గొర్రె మృతి చెందింది. రోజులాగే మేతకు వెళ్తుండగా మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన స్తంభాన్ని తగలి అక్కడికక్కడే గొర్రె మృతి చెందినట్లు బాధిత రైతు కూకట్ల శ్రీకాంత్ తెలిపాడు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

బోథ్: మండల కేంద్రానికి చెందిన గాండ్ల రాజు(42) రిమ్స్‌లో చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్సై రాము కథనం ప్రకారం.. రాజు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది ఈనెల 8న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు సీహెచ్‌సీ నుంచి రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆగస్టు వర్షాలపైనే భారం!

- భారీ వరదొస్తేనే ఎస్సారెస్పీలోకి నీరు
- ప్రస్తుతం 47.25 టీఎంసీలు
- మహారాష్ట్రలోనూ వర్షాలు అంతంతే
- బాబ్లీ గేట్లు ఎత్తినా చేరని నీరు

ప్రాజెక్టు: శ్రీరాంసాగర్
పూర్తిస్థాయి నీటి మట్టం: 90 టీఎంసీలు
ప్రస్తుత నీటిమట్టం: 47.25 టీఎంసీలు
గతేడాది నీటి మట్టం: 77.289 టీఎంసీలు


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

భైంసా: ముసురు వర్షంతో గోదావరి నది ఇప్పటివరకు ఉప్పొంగలేదు. మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు కురియలేదు. గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను జూలై 1న ఎత్తిన ఎస్సారెస్పీలోకి వరద నీరు అనుకున్నంత చేరలేదు. ఆగస్టులో భారీ వర్షాలు కురిస్తేనే పూర్తిస్థాయిలో నిండనుంది. గతేడాది ఈ సమయానికే ఆరుసార్లు గేట్లు ఎత్తి నీటిని వదిలారు. ఈఏడాది ఒక్కసారి గేట్లు ఎత్తే పరిస్థితి రాలేదు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేట్లు కూడా ఎత్తలేదు.

ప్రస్తుత పరిస్థితి..

ఎస్సారెస్పీలో ప్రస్తుతం 1080.80 అడుగుల నీటి మట్టం ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు. ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు ఉంది. గతేడాది ఈ సమయానికి 77.289 టీఎంసీల నీరు నిలవ్వగా ఈసారి ఆ స్థాయిలో వరదనీరు చేరలేదు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 80.05 ఉంది. లక్ష్మీ కెనాల్ ద్వారా 50, సరస్వతీ కెనాల్ ద్వారా 50 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఇక మిషన్ భగీరథ పథకంలో 231 క్యూసెక్కుల నీటిని ఎస్సారెస్పీ నుంచే పలు జిల్లాలకు రోజు పంపిణీ చేస్తున్నారు. తాగునీటి అవసరాలకు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు 63 క్యూసెక్కులు, కోరుట్ల, జగిత్యాలకు 61 క్యూసెక్కులు, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డిలకు 107 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 43.569 టీఎంసీల నీరుచేరగా, ఇప్పటి వరకు 3.839 టీఎంసీల నీటిని బయటకు వదిలేశారు.

ఆ నాలుగు జిల్లాలో ఆయువుపట్టు

జిల్లాలోని చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులన్నీ మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే వాగులు వంకలతోనే నిండుతాయి. ఈ నీరంతా ఉప నదుల నుంచి గోదావరిలో ప్రవహించి ఎస్సారెస్పీలోకి చేరుతుంది. ఎస్సారెస్పీ తెలంగాణలో ఉన్నప్పటికీ నది క్యాచ్‌మెంట్ ఏరియా అంతా మహారాష్ట్రలోనే ఉంది. ఔరంగాబాద్‌కు దిగువన పెద్ద ప్రాజెక్టులు లేకపోవడంతో మరట్వాడ ప్రాంతాల్లో కురిసిన వర్షాలు వరదగా మారి ఎస్సారెస్పీ వైపు పరుగులు తీస్తుంది. ఔరంగాబాద్, జల్నా, పర్బనీ, నాందేడ్ జిల్లాల్లో కురిసిన వర్షాలే గోదావరి నదికి వరదను మోసుకువస్తాయి. ఈ ఏడాది మహారాష్ట్రలో గోదావరి ఉపనదులైన పూర్ణ, ప్రవరల పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురియలేదు. ఫలితంగా బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తినా భారీ వర్షాలు కురిస్తేనే బాసర వద్ద గోదావరిలో నీటి ప్రవాహం పెరుగుతుంది.

ఎత్తిపోతలకు కష్టమే

ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌తో నిర్మల్, నిజామాబాద్ జిల్లాలోని ఎత్తిపోతల పథకాలకు సాగునీరందుతుంది. బ్యాక్‌వాటర్‌తో సరిహద్దు ప్రాంతాల్లోని బోరుబావుల్లో నీరు పెరుగుతుంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం ఉంటేనే పంటలు వేసుకోవచ్చు. వర్షాకాలం మినహా వేసవిలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. మరోవైపు ఎస్సారెస్పీ నుంచి సారంగాపూర్, కుంటాల మండలాల్లోని చాలా గ్రామాలకు నీటిని అందించేందుకు కాలువలు తవ్వించారు. దీని గుండా పొలాలకు పూర్తిస్థాయిలో నీరందే పరిస్థితి లేదు.

ప్రణాళికాబద్ధంగా నీటి విడుదల

ప్రణాళికాబద్ధంగానే నీటిని వదులుతున్నాం. ప్రాజెక్టులో 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రోజువారీగా మిషన్ భగీరథ పథకంలో సాగునీటి కోసం నీరు విడుదల చేస్తున్నాం. పంటల కోసం లక్ష్మీ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, సరస్వతీ కెనాల్‌కు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నాం.
– చక్రపాణి, ఎస్సారెస్పీ ఈఈ

కరెంట్ పునరుద్ధరించాలని ధర్నా

- ఏజీఎం కార్యాలయం ఎదుట బస్తీ పజల ఆందోళన
- సింగరేణి క్వార్టర్లకు సరఫరా చేయాలని డిమాండ్


ధర్నా చేస్తున్న బస్తీ ప్రజలు, నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి క్వార్టర్లకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని బస్తీల ప్రజలు శనివారం ధర్నా నిర్వహించారు. సామూహికంగా తరలివచ్చి సింగరేణి ఏజీఎం కార్యాలయం ప్రధాన గేట్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. కరెంట్ సరఫరాను యథావిధిగా కొనసాగించాలని, సింగరేణి అధికారులు నిర్లక్ష్య వైఖరిని వీడాలంటూ నినాదాలు చేశారు. విధులకు హాజరయ్యేందుకు వచ్చిన ఎలక్ట్రిసిటీ సిబ్బందిని అడ్డుకుని అరగంటకు పైగా ధర్నా చేపట్టారు. కార్మిక, రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ సింగరేణి అధికారులు ఏకపక్షంగా కన్నాల బస్తీ, టేకుల బస్తీ, నెంబర్-2 ఇంక్‌లైన్ బస్తీ, హన్మాన్ బస్తీ, భూడిదగడ్డ బస్తీ తదితర బస్తీల్లోని కాలనీల్లో మూడు రోజుల నుంచి కరెంట్ కనెక్షన్ తొలగించి ప్రజలను అంధకారంలోకి నెట్టారని విమర్శించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పందించి యధాతథంగా కరెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అంతలోనే మందమర్రి నుంచి సింగరేణి విద్యుత్ అధికారులు ఏరియా ఆసుపత్రికి చర్చలకు రావడంతో ఆందోళనకారులు అక్కడికి వెళ్లారు.

సింగరేణి విద్యుత్ అధికారులతో చర్చలు

మందమర్రి ఏరియా వర్క్‌షాప్ డీవైజీఎం సుబ్రమణ్య హరినారాయణ, ఎస్ఈ కృష్ణారెడ్డితో కాంగ్రెస్, కార్మిక సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు సింగరేణి విద్యుత్ అధికారులతో చర్చలు జరిపారు. కరెంట్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే స్థానికంగా వచ్చాక చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటారని అప్పటి వరకు విద్యుత్ సరఫరా చేయాలని కోరడంతో అధికారులు సానుకూలంగా స్పందించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ సూరిబాబు, కార్మిక సంఘాల నాయకులు సిద్దంశెట్టి రాజమొగిలి, రత్నం ఐలయ్య, కాంగ్రెస్ నాయకులు మునిమంద రమేశ్, ఎండీ అఫ్జల్, మాజీ కౌన్సెలర్ పొట్ల సురేశ్, అమానుల్లాఖాన్, మంతెన మల్లేశ్, మల్లారపు చిన్నరాజం పాల్గొన్నారు.

ఇసుక లారీలను వదిలిపెట్టండి

చెన్నూర్: పట్టణంలో బతుకమ్మ వాగు వంతెన వద్ద సీఐ రవీందర్ శుక్రవారం పట్టుకున్న ఇసుక లారీలను వదిలిపెట్టాలని లారీ డ్రైవర్లు, యజమానులు రమేశ్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రెండు లారీలకు వేబిల్లులు లేవని,అధిక లోడ్ ఉందని చెబుతూ తమ మాటలు వినకుండా మైనింగ్ అధికారులకు అప్పగించడం దారుణమన్నారు. కాగా, సీఐ రవీందర్‌ను వివరణ కోరగా ఇసుక లారీలను పట్టుకొని కొద్ది గంటలలోనే మైనింగ్ అధికారులకు అప్పగించామన్నారు. మైనింగ్ ఏడీ జగన్‌మోహన్‌రెడ్డిని వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్నారని నాలుగు లారీలను సీఐ రాతపూర్వకంగా ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో నేను సమావేశం ఉంటే వెళ్లాను. లారీల వేబిల్లులు, కాంటాలను పరిశీలించగా అన్ని సక్రమంగా ఉన్నాయన్నారు. సీఐ ఇచ్చిన మెమోకు బదులు పంపించి ఆదివారం ఉదయం లారీలను వదిలిపెడుతామన్నారు.

జీఎంగా పదోన్నతిపై వెళ్తున్న అధికారికి వీడ్కోలు


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న జీఎం సంజీవరెడ్డి

జైపూర్: ఇందారం ఐకే ఓసీ ప్రాజెక్ట్ అధికారిగా విధులు నిర్వహించిన ఎం.శ్రీనివాస్ బెల్లంపల్లి ఏరియా జీఎంగా పదోన్నతిపై వెళ్తున్న ఆయనకు అధికారులు వీడ్కోలు పలికారు. ఐకే 1ఏ, ఐకే ఓసీపై శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాస్‌ను అధికారులు, ఉద్యోగులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

శ్రీరాంపూర్: ఇందారం ఓసీపీ అధికారిగా పనిచేసి పదోన్నతిపై వెళ్తున్న బెల్లంపల్లి జీఎంగా బదిలీపై వెళ్తున్న ఎం శ్రీనివాస్‌ని శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డి, అధికారులు సత్కరించారు. బెల్లంపల్లి ఏరియాలో ఉత్తమ అధికారిగా రాణించాలని ఆకాంక్షించారు. ఎస్ఓటూజీఎం సత్యనారాయణ, ఏజెంట్ గోపాల్ సింగ్, రాముడు, డీజీఎంలు అరవింద రావు, చిరంజీవి, యాదయ్య, ఎస్టేట్ అధికారి వరలక్ష్మి, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ ఆధ్వర్యంలో..

ఆర్కే 5 గ్రూపు ఏజెంట్‌గా పనిచేసి ఐకే 1ఏ గ్రూప్ ఏజెంట్‌గా బదిలీపై వెళ్తున్న వెంకటేశ్వర్ రెడ్డిని బీఎంఎస్ నాయకులు సన్మానించి వీడ్కోలు పలికారు. ఆర్కే-5 గనిపై జరిగిన కార్యక్రమంలో బీఎంఎస్ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్ ఖాదిర్, నాయకులు రాజేందర్, ప్రభాకర్, రాజేంద్రప్రసాద్ మేకల స్వామి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో..

బదిలీపై వెళ్తున్న ఏజెంట్ వెంకటేశ్వర్ రెడ్డిని సన్మానించి ఐఎన్టీయూసీ నాయకులు సన్మానించి వీడ్కోలు పలికారు. ఆర్కే 5 గనిపై జరిగిన కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు, యూనియన్ నాయకులు శ్యామ్, గరిగ స్వామి, భీంరావు, తిరుపతి రాజు, జగదీశ్వర్ రెడ్డి, మహేందర్ రెడ్డి నీలం సదయ్య పాల్గొన్నారు.

హైపర్ కమిటీ వేతనాలు అమలు చేయాలి


సమావేశంలో పాల్గొన్న బీఎంఎస్ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియాలో మాదిరిగా హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలని బీఎంఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు పులి రాజిరెడ్డి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాంచీలో దీనిపై మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లింపు, ఇతర అంశాలపై కోలిండియా యాజమాన్యంతో చర్చించారు. కాంట్రాక్ట్ కార్మికులకు సామాజిక భద్రతతోపాటు సీఎంపీఎఫ్, ఈఎస్ఐ, పీహెచ్‌డీ, స్లేడే ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన ఎమ్మెల్యే


వార్తా క్లిపింగ్స్‌ను ప్రదర్శిస్తున్న సభ్యులు

బెల్లంపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ విస్మరించారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న టీమ్ జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ విమర్శించారు. పట్టణంలోని కాంటా చౌరస్తాలో హామీలకు సంబంధించిన పేపర్ క్లిప్పింగ్‌లను శనివారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ హామీని వినోద్ నెరవేర్చలేదన్నారు. నెన్నెల మండలం కోనంపేట గ్రామానికి నాలుగు నెలల్లో రోడ్డు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చి ఆ మాటను నిలబెట్టుకోలేకపోయారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతిరోజు ఏదో ఒక వార్డులో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నా నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. టీమ్ సభ్యులు శ్రీనివాస్ , అరవింద సాయి కుమార్, కస్తూరి రాకేశ్ పాల్గొన్నారు.

గూడెంలో 'శ్రావణ' సందడి



దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా భక్తుల సందడి కనిపించింది. జిల్లాతోపాటు, ఇతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. సత్యదేవున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 80 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు.

ఫలితమిస్తున్న గడ్డిక్షేత్రాలు

- గతేడాది జన్నారం డివిజన్‌లోనే 72 హెక్టార్లు
- ఐదేళ్లలో 900 హెక్టార్లు
- పెరుగుతున్న వన్యప్రాణుల సంఖ్య


జన్నారం డివిజన్‌లో గడ్డి మైదానం

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ 893 చదరపు కి.మీ విస్తీర్ణంలో కోర్ ఏరియా, 1123 చదరపు కి.మీలో బఫర్ ఏరియా విస్తరించి ఉంది. ఈ ప్రాంతాన్ని 2012లో కేంద్రం టైగర్‌జోన్‌గా ఏర్పాటు చేసింది. అప్పటినుంచి పులుల రాకపోకలే తప్ప ఇక్కడ అవాసం ఏర్పాటు చేసుకున్న దాఖలాలు లేవు. శాఖహార జంతువుల సంతతి పెంచి, టైగర్‌జోన్‌లో పులి అవాసం ఏర్పర్చుకునేలా అటవీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. అడవిలో వన్యప్రాణుల సంఖ్య అనేది ఆవాసాల్లో విస్తరించి ఉన్న గడ్డిక్షేత్రాల సాంద్రతపై ఆధారపడి ఉంటుంది. కనీసం పది శాతం గడ్డిక్షేత్రాలు విస్తరించి ఉంటే శాఖహార జంతువుల సంతతి పెరుగుతుంది. ఈ క్రమంలోనే పులి వచ్చే అవకాశాలు మెండుగా ఉంటుందనేది అధికారులు యోచన.

అధికారులకు శిక్షణ

గడ్డిక్షేత్రాల పెంపకంతో జింకలు, దుప్పులు, సాంబర్లు, నీలుగాయిలు, కొండగొర్రెలు, అడవి దున్నలు, గడ్డిజింకలు, ఇతర వన్యప్రాణులు ఆధారపడి జీవిస్తాయి. పులులు, చిరుతపులులు, నక్కలు, అటవీ కుక్కలు, తోడేళ్లు ఆధారపడుతాయి. గడ్డిక్షేత్రాల పెంపకంపై అధికారులకు జన్నారంలో మహారాష్ట్రకు చెందిన నిపుణుడు డా.జీడీ మురత్కర్ 2018లో శిక్షణ ఇచ్చారు. సహజ గడ్డిక్షేత్రాలు, విత్తనాల సేకరణ, ముళ్ల కంచెల తొలగింపు, కలుపు మొక్కల నివారణ, గడ్డి విత్తనాల నిల్వ సస్యరక్షణ చర్యలపై శిక్షణ ఇచ్చారు. అప్పటినుంచి ప్రారంభమైన గడ్డి క్షేత్రాల పెంపకం ప్రస్తుతం ఫలితాలిస్తోంది.

2018 నుంచి పెంపకం

2018 నుంచి కవ్వాల్ టైగర్‌జోన్‌లో గడ్డి క్షేత్రాలు పెంపకానికి శ్రీకారం చుట్టింది. 2023 వరకు 900 హెక్టార్లలో ఈ క్షేత్రాలు పెంచారు. దేశంలోని పలు టైగర్ జోన్ల అధికారులు గడ్డిక్షేత్రాల పరిశీలనకు జన్నారం రావడం విశేషం. వీటి నిర్వహణ, చేపడుతున్న చర్యలు, వన్యప్రాణులకు ఇష్టమైన గడ్డి తదితర అంశాలపై అవగాహన పొందారు. కొన్ని ప్రాంతాల్లో గడ్డి విత్తనాలను చల్లి సహజసిద్ధంగా గడ్డిని పెంచుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో సహజసిద్ధంగా మొలసిన గడ్డి చుట్టూ కంచె వేసి, కలుపు తొలగిస్తూ పెంపకం చేస్తున్నారు.

జన్నారం అటవీ డివిజన్‌లోనే 72 హెక్టార్లు

రాష్ట్రవ్యాప్తంగా గత సంవత్సరం వంద హెక్టర్లలో గడ్డి మైదానాలు ఏర్పాటు చేయగా అందులో 72 హెక్టార్లు జన్నారం అటవీ డివిజన్‌లో ఏర్పాటు చేశారు. ఈ ఏడాది తాళ్లపేట, జన్నారం, ఇందన్‌పల్లి మూడు రేంజ్‌ల్లో కలిపి 172 హెక్టార్లు గడ్డి క్షేత్రాలు పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు. గత రెండేళ్ల క్రితం పోలిస్తే వన్యప్రాణుల సంఖ్య రెట్టింపు అయింది. ఖానాపూర్, ఉట్నూర్, జన్నారం, ఆసిఫాబాద్ అటవీ డివిజన్లలో 300 హెక్టార్లలో పెంచాలని ఆదేశాలు ఉన్నాయి.

గడ్డి మైదానాలు పెంచుతాం

విరివిగా గడ్డి మైదానాలు పెంచడం వల్ల వన్యప్రాణుల సంఖ్య పెరుగుతుంది. కవ్వాల్ టైగర్ జోన్‌లో 300 హెక్టార్లలో గడ్డి మైదానాలు ఏర్పాటు చేస్తున్నాం. అన్ని డివిజన్లలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.
– శాంతారాం, ఎఫ్‌డీపీటీ

నాగోబా ఆలయ హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: నాగుల పంచమి సందర్భంగా నాగోబా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని మెస్రం వంశీయులు శనివారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.1,80,895, తైబజర్ ద్వారా రూ.28,060లు ఆదాయం వచ్చిందని ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, ఆలయ చైర్మన్ మెస్రం తుకారాం తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఈ డబ్బులను ఖర్చు చేస్తామన్నారు. మెస్రం బాదిరావ్, కోసేరావ్, దేవ్‌రావ్, శేఖర్‌బాబు, సోనేరావ్, వంశీయులు శేక్‌నాథ్, గ్రామస్తుడు కోట్నాక్ బారిక్‌రావ్ తదితరులు ఉన్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలి కాటు



జన్నారం: జన్నారం అటవీ డివిజన్, తాళ్లపేట్ రేంజ్ మహ్మదబాద్ బీట్‌లో పలు టేకు చెట్లపై గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డలి కాటు వేశారు. మహ్మదబాద్ గేట్ నుంచి మల్యాలకు వెళ్లే దారిలో ఘటన చోటు చేసుకుంది. కొన్ని చెట్లు నరికి వేయగా,మరికొన్ని చెట్ల చుట్టు గొడ్డలితో కాటుపెట్టారు. ఈ విషయంపై ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావును సంప్రదించగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందనే ఉద్దేశంతో కొందరు చెట్లను నరికివేశారన్నారు. వారిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న మన్మోహన్, తదితరులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి బీడీ మన్మోహన్ బాక్సింగ్ టోర్నమెంట్ పోటీలు శనివారం ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బీడీ మన్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఎంతోమంది ప్రతిభ ఉన్న బాక్సింగ్ క్రీడాకారులు ఉన్నారని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాకు బాక్సింగ్ ఖేలో ఇండియా సెంటర్ మంజూరు కావడం ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రానికి చెందిన ప్రముఖ బాక్సింగ్ క్రీడాకారులు నిఖత్ జరీన్, హుసాముద్దీన్‌లను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రవీందర్, టీబీఏ ప్రతినిధులు రవీందర్, బాల్ బహదూర్, కృష్ణ, శ్రీనివాస్, ఎల్లయ్య, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, నల్గొండ, నిజామాబాద్ ప్రతినిధులు రవీందర్‌గౌడ్, షంషుద్దీన్, జిల్లా అధ్యక్షుడు విజయేందర్, శేఖర్, బేగ్, బాక్సింగ్ కోచ్ సాయి, జూడో కోచ్ రాజు ఉన్నారు.

అశోక్‌యాదవ్‌కు డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ అందుకుంటున్న అశోక్‌యాదవ్

భీమారం: మండలంలోని కాజిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము అశోక్‌యాదవ్‌కు శనివారం పాండిచ్చేరిలోని గ్లోబల్ అకాడమీ కౌన్సిల్ జర్మనీ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. గత 15 ఏళ్లుగా సామాజిక సేవా రంగంలో సేవలందించడం, జిల్లాలో కరోనా సమయంలో వైద్యశిబిరాలు ఏర్పాటు తదితర వాటికిగాను ఆయన్ను డాక్టరేట్ పురస్కారంతో సత్కరించింది. యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ సుబ్బయ్య, సినీ నిర్మాత అశ్వనీదత్ తదితరులు పాల్గొన్నారు.

వాగులు దాటి.. వైద్యం చేసి


వాగును దాటుతున్న ఏఎన్ఎం, ఆశాకార్యకర్త

సిర్పూర్(టి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగుతున్నాయి. మండల కేంద్రం నుంచి చీలపెల్లి వరకు ఏఎన్ఎం శ్యామల, ఆశకార్యకర్త సుజాత శనివారం వాగులు దాటి గ్రామానికి చేరుకున్నారు. చీలపెల్లి–పూసిగూడ గ్రామాల మధ్యలో రెండు వాగులు, ఒర్రెలు దాటి కాలినడకన పూసిగూడకు వెళ్లారు. అక్కడ గర్భిణులు, గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.